క్లుప్తంగా

సజావుగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ ఎగ్జామ్స్ రాస్తున్న విద్యార్థినులు

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. ఆదివారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. తొలి విడతలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాజాం కేంద్రంగా మొత్తం ఆరు కళాశాలల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్ల కింద ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న వీఆర్ఓ, ప్రజాప్రతినిధులు

తెర్లాం: అనారోగ్యంతో మండలంలోని డి.గదబవలస గ్రామానికి చెందిన వీఆర్ఏ జంగం గురువులు ఆదివారం మృతి చెందారు. వీఆర్ఏ మృతికి తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది సంతాపం ప్రకటించారు. సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ వావిలపల్లి ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బెవర వెంకట శేషగిరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.5 వేలను వీఆర్ఓ రామయ్య చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్వేతాచలపతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని, పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. మొత్తం 937 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచినట్లు ప్రిన్సిపాల్ జార్జ్ ఫ్రాన్సిస్ తెలిపారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణం



కొప్పర గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. బూరి వీధిలో దాదాపు రూ.4 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్నామని, మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి సవలాపురపు రామారావు తెలిపారు.

పుస్తక పఠనంపై దృష్టి సారించాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనంపై దృష్టి సారించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం చేపట్టి, చిన్నారులు, విద్యార్థులతో పుస్తకాలు, కథలు చదివించడం, రాయించడం వంటివి చేయిస్తూ వారికి చదువుపై మక్కువ పెంచుతోందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలు చదివించి, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రామభద్రపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1981–82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత వారు కలుసుకోవడంతో ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కోన సత్యనారాయణ, చప్ప సూర్యనారాయణ, కోట రాములు, మత్స లక్ష్మణరావు, మీసాల పాపారావులను సన్మానించారు.

జాతర చూసొద్దాం రండి..

- నేటి నుంచి చిన్నమ్మతల్లి జాతర మహోత్సవం
- అట్టహాసంగా 3 రోజుల పాటు నిర్వహణ
- ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల హాజరు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



రామభద్రపురం: ముస్తాబు చేసిన చిన్నమ్మతల్లి ఆలయం

రామభద్రపురం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి చిన్నమ్మతల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. రామభద్రపురంలో దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర మహోత్సవాన్ని ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినానికి ముందు అమ్మవారిని గద్దె వద్దకు తీసుకువచ్చి, శివరాత్రి దాటిన తర్వాత మూడో వారంలో అనుపోత్సవం చేపడతారు. ప్రస్తుతం సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ జాతరకు సంబంధించి, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు తొలేళ్ల ఉత్సవం, ఆ మరుసటి రోజు ఘటాల తిరువీధి, చివరి రోజు అంజలి రథోత్సవం, అనుపోత్సవం చేపడతారు. విజయనగరం జిల్లా నుంచే కాకుండా విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా విశేష సంఖ్యలో భక్తులు జాతరకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.

సాంస్కృతిక ప్రదర్శనలు..

జాతరలో భాగంగా సోమవారం భాగవతం, మంగళవారం క్లాసికల్ కోలాటం, దాండియా, యమలీల, కనకదుర్గ, కాంతార నృత్య ప్రదర్శనలు, మ్యూజికల్ డీజే, తీన్మార్ డ్యాన్స్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే ప్రతీ వీధిలో బుర్రకథలు, రెలారే రేలా వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా 70 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

అమ్మవారి చరిత్ర..

మూడడ్ల ఇంటి పేరున్న వారింట్లో ఆవిర్భవించిన చిన్నమ్మవారి ఆవిర్భావం వెనక ఓ ఆసక్తికరమైన కథనం ప్రచారంలో ఉంది. ఎనిమిదో తరానికి చెందిన వృద్ధురాలు మూడడ్ల చిన్నమ్మి, మూడడ్ల మహాలక్ష్మి, వంగపండు సూర్యనారాయణ వంటి పెద్దల కథనం ప్రకారం.. సరిగ్గా మూడు వందల ఏళ్ల క్రితం రామభద్రపురంలో మూడడ్ల వారింట్లో మజ్జిగ చిలుకుతున్నప్పుడు ఆ మజ్జిగలో అమ్మవారి ప్రతిమ బయటపడింది. ఆ కుటుంబీకులు ఆ ప్రతిమను పట్టించుకోకుండా అటక మీద పడేసి, పొలం పనులకు వెళ్లిపోయారు. ఓ రోజు ఆ గ్రామంలో మూడడ్ల వారి వీధి మీదుగా గాజుల వ్యాపారులు గాజులోయమ్మ గాజులూ.. అంటూ కేకలు వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. అదే సమయంలో మూడడ్ల వారింటి నుంచి ఓ యువతి వచ్చి, గాజులు వానిని పిలిచి గాజులు వేయించుకుని, డబ్బుల కోసం మళ్లీ రమ్మని చెప్పింది. వెనుదిరిగిన గాజుల వ్యాపారులు తిరిగి వచ్చేటప్పటికి మూడడ్ల కుటుంబీకులు ఇంట్లో ఉన్నారు. ఆ ఇంట్లో నుంచి వచ్చిన యువతి గాజులు వేయించుకుని, డబ్బులు ఇవ్వలేదని వ్యాపారులు చెప్పగా, వారు విస్తుపోయారు. తమ ఇంట్లో అమ్మాయిలే లేరని, గాజులు కొనడం అబద్ధమని వాదించారు. దీంతో గాజుల వ్యాపారులు వారిని తిట్టుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంతలో మూడడ్ల వారి ఇంట్లో ప్రతిమను ఉంచిన అటకపై నుంచి విరిగిన గాజులు కిందపడ్డాయి. ఇది అమ్మవారి మహాత్మ్యమేనని విశ్వసించిన వారు ఆ ప్రతిమను తీసుకువెళ్లి, గ్రామ శివారులోని ఈత చెట్టు, కాగు చెట్టు కలిసి ఉన్న చోట గుడి కట్టి, ఆ గుడిలో ఆ ప్రతిమను పెట్టారు. తమ ఇంట్లో ఆడపిల్లలు లేకపోవడంతో ఆమెనే ఆడపిల్లగా భావించి ఆ ప్రతిమకు చిన్నమ్మ అని పేరు పెట్టి, వారు పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ తల్లి తనను నమ్ముకున్న భక్తులకు అండగా నిలుస్తూ, వారిని కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందింది. ఈ క్రమంలో ప్రతీ సంవత్సరం జరిగే ఈ జాతరకు భక్తులు విచ్చేసి, అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి అనుగ్రహం పొందుతారు.

నేడు పోతన్న విగ్రహావిష్కరణ..



బొబ్బిలి రూరల్: పూజలందుకుంటున్న శిర్లి ఎల్లమ్మతల్లి

బొబ్బిలి రూరల్: స్థానిక యాదవ వీధిలో శిర్లి ఎల్లమ్మతల్లి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల్లో భాగంగా శిర్లి పోతన్న విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నామని, మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి, అన్నదాన కార్యక్రమం చేపడతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా శిర్లి పోతన్న యాత్ర..



రామభద్రపురం: శిర్లి పోతన్న విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో శిర్లి పోతన్న, ఎల్లమ్మతల్లి యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా చిన్నమ్మతల్లి జాతరకు ముందు ఈ యాత్రను నిర్వహిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు యాత్రకు విచ్చేసి, శిర్లి ఎల్లమ్మతల్లి, పోతన్నలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, గుడ్లు, ఉలవలతో కలిపిన బియ్యం, కొత్త చీరలు సమర్పించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి విగ్రహంతో పాటు, పాము ఆకారంలో ఉన్న పోతన్న విగ్రహాలను పుర వీధుల్లో మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. రామభద్రపురంతో పాటు పరిసర గ్రామాలైన కొండకెంగువ, బూసాయవలస, ముచ్చర్లవలస, సోంపురం, మర్రివలస, నాయుడువలస, తారాపురం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు యాత్రలో పాల్గొన్నారు. యాత్ర నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎస్ఐ సురేంద్రనాయుడు పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

లక్ష్మీనరసింహస్వామి సంబరాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి, సింహాద్రి అప్పన్న సంబరాలకు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన ఆల్తి కుటుంబీకులు ఈ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుండగా, ఆయా నేతలు వారిని అభినందించారు. భగవంతుని ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని నేతలు పూజించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారాదిలో గ్రామదేవతల సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో కొత్తపోలమ్మ, పాతపోలమ్మ, నూకాలమ్మ గ్రామదేవతల సంబరాలు సోమవారం నిర్వహించనున్నారు. తొమ్మిదేళ్లకోసారి జరిగే ఈ పండగను కోవిడ్ మహమ్మారి కారణంగా గత రెండేళ్లుగా చేయకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో 11 ఏళ్ల తర్వాత సంబరాలు కావడంతో అంగరంగ వైభవంగా చేసేందుకు గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు. పారాదిలో జరిగే అంజలి రథోత్సవం, సిరిమానోత్సవం, బళ్లవేషాల ప్రదర్శనలు చూసేందుకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పోటెత్తుతారు. మండలంలోని భోజరాజపురం, నారాయణప్పవలస, కాశిందొరవలస వంటి దాదాపు 13 గ్రామాల్లో కూడా గ్రామదేవతల సంబరాలు నిర్వహిస్తారు.



అమ్మవార్ల ఘటాలకు పూజలు చేసిన దృశ్యం

సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం చేపడతారు. ఈ క్రమంలో ఆదివారం అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు.

సొంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు



నారాయణప్పవలస రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు తన సొంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. డలంలోని నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామాల రోడ్లు పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో అటువైపుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన రూ.3 నుంచి రూ.4 లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతులు చేయిస్తున్నారు. సదరు నేత మంచి పనిని ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాగారపు శ్రీనివాసరావు, కరణం దాలెమ్మలతో పాటు గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు. గ్రామదేవతల పండగ కూడా ఉండడంతో రోడ్డు పనులు పూర్తయితే బాగుంటుందని అంతా భావిస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీబీసీడబ్ల్యూఓ యశోదనరావు

బొబ్బిలి: విద్యార్థులు బాగా చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి(డీబీసీడబ్ల్యూఓ) యశోదనరావు ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక పట్టణంలోని బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థుల డివిజన్ స్థాయి ప్రేరణ, పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సబ్జెక్ట్‌లోని అంశాలను ఎంతో ఆసక్తితో నేర్చుకుని, ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని తద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఏబీసీడబ్ల్యూఓ ఎ.శ్యామలాదేవి మాట్లాడుతూ పదో తరగతిలో అన్ని సబ్జెక్టులు కీలకమేనని, అన్ని సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధిస్తే ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు డి.శ్రీనివాసరెడ్డి, దాసు, గణపతి పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న డీబీసీడబ్ల్యూఓ యశోదనరావు

షూటింగ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు

వంగర: షూటింగ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని మడ్డువలస దగ్గర విలేకరులతో మాట్లాడిన ఆయన క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు, యువత చదువు తో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. మార్చి 3వ తేదీ నుంచి గుంటూరు జిల్లాలో జరిగే జాతీయ సీనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచే జట్లలో ద్వితీయ బహుమతి పొందిన జట్టుకు సంబంధించి ప్రైజ్‌మనీ తాను అందజేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికలయ్యే వరకు 'స్పందన' రద్దు

రేగిడి: ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మళ్లీ యధావిధిగా కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండడం, సామాజిక సేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆధ్యాత్మిక వక్తలు నిత్యానందస్వామి, త్రినాథరావు, అప్పలరాములు అన్నారు. ఆదివారం మండలంలోని దేవుదల గ్రామంలో జరిగిన గీతా జ్ఞానబోధ సభలో పాల్గొన్న వారు మానవుని ఆలోచనా విధానాలు పరులకు ఉపయోగపడేలా ఉండాలని హితవు పలికారు. సత్ప్రవర్తన కలిగి ఉన్న నాడే సమాజంలో మంచి పేరును సంపాదించవచ్చన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రాజాం: పట్టణంలోని బాబానగర్‌లో ఉన్న శివం సత్యసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజాం జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి విచ్చేసిన వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శివం మందిరం కన్వీనర్ ఏవీ ఆచారి, కో–ఆర్డినేటర్ డీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకుని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇచ్చేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడంతో పాటు సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగనన్నను చూసి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్క పట్టభద్రుడిని కలిసి, ప్రభుత్వ పాలనను వివరిస్తూ ఓట్లు అడుగుతామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలంతా కూడా తమ పార్టీ మద్దతిస్తున్న అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల బూత్ కమిటీ మేనేజర్ పత్తిగుళ్ల ఏకనాథ్ పాల్గొన్నారు.

రూ.2.34 లక్షల వ్యయంతో చప్టా ఆధునీకరణ



ఆధునీకరణకు ముందు చప్టా నిర్మాణం ఇలా..



ఆధునీకరించిన తర్వాత చప్టా ఇలా..

మెంటాడ: మండలంలోని పెదచామాలాపల్లి గ్రామంలో ఉన్న గురునాయుడు చెరువు దగ్గర చప్టా నిర్మాణాన్ని దాదాపు రూ.2.34 లక్షల వ్యయంతో ఆధునీకరించారు. ఇదివరకు అక్కడ పాడైన చప్టా నిర్మాణంతో చెరువులోని నీరు వృథాగా బయటకుపోయేది. దీంతో గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన సర్పంచ్ బాయి తవుడమ్మ 14వ ఆర్థిక సంఘం నిధులతో చప్టా నిర్మాణ ఆధునీకరణ పనులు చేయించి, వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ పనిని గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు.

స్నేహం అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

- మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు

రాజాం సిటీ: స్నేహం అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక అంబికా ఫ్యాక్టరీలో ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన డోలపేటకు చెందిన కళాకారులు గోకవలస కృష్ణమూర్తి, ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా ఉత్తమ ఎంఎంఎస్ అధ్యక్షురాలుగా పురస్కారం అందుకున్న రాజాం ఎంఎంఎస్ అధ్యక్షురాలు సామంతుల అరుణలను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు, పలు రంగాల్లోని కళాకారులు, మహిళలను స్నేహం అసోసియేషన్ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీతలు కూడా ఎంతో మందికి ప్రేరణగా నిలవాలని స్నేహం అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్, పొట్టా వెంకటేష్, గట్టి పాపారావు, సీమకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అరుణ, కృష్ణమూర్తిలను సత్కరిస్తున్న స్నేహం అసోసియేషన్ సభ్యులు

'పది' విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష

బొబ్బిలి: పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షకు దాదాపు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో నెలకొన్న పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టడంతో పాటు వారిలోని ప్రజ్ఞా పాటవాలు బయటపడతాయని, తద్వారా విద్యార్థులు తమ చదువును మెరుగుపరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మణికుమార్, యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

రాజాం సిటీ: పరీక్షలంటే భయం వీడాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు అన్నారు. ఆదివారం స్థానిక డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపైనే కాకుండా పరీక్షల్లో భయం పోగొట్టేలా ఇటువంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలను స్ఫూర్తిగా తీసుకుని, పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: ప్రజ్ఞా వికాస పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

ఘనంగా పోలిపల్లి పైడితల్లి జాతర ప్రారంభం



రాజాం సిటీ: పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



రాజాం సిటీ: వనం చెట్టు దగ్గర భక్తుల పూజలు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో పోలిపల్లి పైడితల్లి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున ఆలయ మేనేజర్ బీవీ మాధవరావు తొలిపూజ చేసి, జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రతిఏటా లాగే పారిశ్రామికవేత్త పొట్టా కల్యాణ్ చక్రవర్తి పూజలు చేసి, హుండీని ప్రారంభించగా, చెలికాని బదరీనారాయణ టిక్కెట్ కౌంటర్‌ను ఆరంభించారు. డాక్టర్ పీఎల్ఎన్ రాజు అమ్మవారికి పసుపు, కుంమలతో పాటు నూతన వస్త్రాలు అందజేశారు. జాతరలో భాగంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, సర్కస్‌లు, రంగుల రాట్నాలు ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం జాతరకు జనం పోటెత్తడంతో పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీ దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు.